సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 1 । మే । 2025



వైభవోపేతంగా అక్షయ తదియ

శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్షయ తదియ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. - 8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మామిళ్లపల్లి సెక్షన్, ఇప్పపెంట బీటు, పాలకొండ రిజర్వు ఫారెస్ట్‌లోని 'వంక బావి రస్తా' ప్రదేశంలో 34 ఎర్రచ్రందనం దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.6 /27.4

జిల్లాలో బుధవారం 27.4 - 39.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నిరాశ్రయులకు మరో మూడేళ్లు వసతి



జెడ్పీ చైర్మన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ కాంప్లెక్స్‌లో ఉంటున్న నిరాశ్రయులకు మరో మూడేళ్లపాటు వసతి కల్పిస్తామని జెడ్పీ చైర్మన్ రామగోవింద రెడ్డి హామీ ఇచ్చారు. శ్రీ విజయ సేవా సమితి కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి బుధవారం జెడ్పీ చైర్మన్‌ను కలిసి నిరాశ్రయులకు వసతి సౌకర్యాన్ని పొడిగించాలని కోరారు. ఇందుకు జెడ్పీ చైర్మన్ పై విధంగా స్పందించారు. పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ఇచ్చిన హామీని నెర వేరుస్తామన్నారు. ఒకటి, రెండు రోజుల్లో వసతి గృహాన్ని సందర్శించగలనని తెలిపారు.

ప్రశాంతంగా పాలిసెట్



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి


కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించిన పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్) ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని కడప, పొద్దుటూరులలోని 16 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు 8268 మంది విద్యార్థులకు 7271 మంది హాజరుకాగా 997 మంది గైర్హాజరయ్యారు. ఇందులో కడపలోని 12 పరీక్షా కేంద్రాల్లో 3309 మంది హాజరుకాగా 644 మంది గైర్హాజరయారు. పొద్దుటూరులోని 04 పరీక్షా కేంద్రాల్లో 3962 మంది హాజరకాగా 353 మంది గైర్హాజరైయారు. పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి, జిల్లా అసిస్టెంట్ కో ఆర్డినేటర్ దామోదరంలు కడపలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఏర్పాట్లును పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలను ఇచ్చారు.ఈ సందర్భంగా పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ జ్యోతి మాట్లాడుతూ ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష జరిగిందని, తెలిపారు. విద్యార్థులంతా నిర్ణీత సమయంలోపే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారని చెప్పారు.

మైనారిటీలకు సబ్సిడీ రుణాలు

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి కడప జిల్లాలోని మైనారిటీ, క్రిస్టియన్ వర్గాలకు సబ్సిడీ రుణాల కోసం మే 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వి. బ్రహ్మయ్య తెలిపారు. మైనారిటీలకు లక్ష నుంచి రూ. 8 లక్షల వరకు, క్రిస్టియన్ మైనారిటీలకు లక్ష నుంచి రూ. 5 లక్షలవరకు రుణాలు అందిస్తామన్నారు. ఎంపికైన వారికి 50 శాతం సబ్సిడీ మంజూరవుతుందని తెలిపారు. అర్హత కలిగిన వారు https://apobmma.apcfss.in వెబ్‌సైట్‌ల్లో దరఖాస్తు చేసుకవాలని తెలిపారు. ఇందుకు మే 25 వరకు గడువు ఉందని తెలిపారు. ఇతర వివరాలకు 9290448452, 08562-241137 నంబర్లలో సంప్రదించాలని బ్రహ్మయ్య తెలిపారు.

భద్రకాళీసమేతుడికి చందన అలంకారం





చందనఅలంకరణలో స్వామి, అమ్మవారు

రాయచోటి టౌన్ : అక్షయ తృతీయ సందర్భంగా రాయచోటిలోని వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారు చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో వెలసిన శ్రీ బసవ దేవుడికి బసవ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నర్సరీ పరిశీలన

సిద్దవటం : సిద్దవటం లోని అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలను బుధవారం సాయంత్రం కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో ఇంకొన్ని మొక్కలను పెంచి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్లాంటేషన్‌ను మరింతగా అభివృద్ధి చేసి అటవీ ప్రాంతంలో మొక్కలు నాటడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు డీఎఫ్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, టెక్నికల్ అసిస్టెంటు రమణ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కళ తప్పిన పసిడి పురి

- ఒడిదుడుకుల మధ్య బంగారు వ్యాపారం
- ఆర్థిక ఇబ్బందుల్లో వ్యాపారులు, కార్మికులు
- నగదు చెల్లిస్తేనే బంగారం



ప్రొద్దుటూరులోని బంగారంగళ్ల వీధి (ఇన్‌సెట్) ఆభరణం తయారు చేస్తున్న స్వర్ణకార్మికుడు దస్తగిరి

ప్రొద్దుటూరు : వ్యాపారంలో ఒడిదుడుకులు కారణంగా పసిడిపురి కళ తప్పింది. అమాంతంగా బంగారం ధరలు పెరగడంతోపాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా బంగారం కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. శుభకార్యాల కోసం అవసరాలకు మాత్రమే ఆభరణాలను కొనుగోలు చేస్తున్నారు. పైగా కొనుగోలుదారులు పూర్తిగా నగదు చెల్లిస్తే కానీ వ్యాపారులు ఆభరణాలను తయారు చేయించి ఇచ్చే పరిస్థితి లేదు.

రాష్ట్రంలో పసిడి వ్యాపారానికి ప్రొద్దుటూరు ప్రసిద్ధి గాంచింది. బంగారు ఆభరణాల దుకాణాలతోపాటు వేల మంది స్వర్ణకార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రత్యేక్షంగా, పరోక్షంగా వేలాది మందికి బులియన్ మార్కెట్ ఉపాధి కల్పిస్తోంది. ఈ ఏడాది జనవరి 1న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,500 నమోదైంది. మార్చి 11న రూ.86వేలు ఉండగా.. ఈనెల 22న ఇదే ధర రూ.లక్షకు దాటింది. దేశంలోని మిగతా ప్రాంతాల్లో రూ.లక్షా 5వేల వరకు ధర పలకగా, ప్రొద్దుటూరులో రూ.లక్షకు చేరుకుంది. ధరల హెచ్చు తగ్గులతో అటు వ్యాపారులు, ఇటు స్వర్ణ కార్మికులు, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవసరాలకు సంబంధించి గతంలో బంగారు ఆభరణాల కోసం వచ్చే వారు కేవలం అడ్వాన్స్ రూపంలో కొంత మొత్తాన్ని చెల్లించి మిగతా సొమ్మును ఆభరణాలు తయారు చేశాక డబ్బు చెల్లించి తీసుకెళ్లే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ధరల ప్రభావం కారణంగా పూర్తి డబ్బు కొనుగోలుదారులు చెల్లిస్తే కానీ ఆభరణాలు తయారు చేయించే పరిస్థితి లేదు. స్వయంగా వ్యాపారులే ఈ విషయాన్ని చెబుతున్నారు.



రియల్ ఎస్టేట్ ప్రభావమే పెద్ద కారణం

గత ఏడాది ఎన్నికల ముందు నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. భూముల కొనుగోలు, అమ్మకాలు ధమాల్ అన్నాయి. తద్వారా మార్కెట్‌లో మనీ రొటేషన్ లేదు. మరో వైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షల ప్రభావం బంగారం మార్కెట్‌పై పడింది. అన్ని వ్యాపారాలపైన ఇదే పరిస్థితి ఉందని వ్యాపార నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ ఇంతటి ఇబ్బందులు చూడలేదని వాపోతున్నారు.

వ్యాపారాలు లేవు



బంగారు ధరల హెచ్చుతగ్గుల ప్రభావం మార్కెట్‌పై తీవ్రంగా ఉంది. గత రెండేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం లేకపోవడం మరోకారణం. వ్యాపారులు ముడి బంగారం కొనేందుకు భయపడుతున్నారు. ఎప్పుడు పెరుగుతుందో, ఎప్పుడు తగ్గుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వ్యాపారాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. – బుశెట్టి రాంమోహన్‌రావు, రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు.

ధరలు అమాంతం పెరిగాయి



బంగారం ధరలు అమాంతం పెరిగాయి. సాధారణ మధ్యతరగతి ప్రజలు బంగారం చూసేందుకే తప్ప కొనుగోలు చేసే పరిస్థితి లేదు. తులం బంగారం రూ.లక్ష దాటి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ధరలు ఇంకా పెరుగుతాయని కొందరు, తగ్గుతాయని మరికొందరు ప్రచారం చేస్తున్నారు. మార్కెట్‌లో అనిశ్చితి ఏర్పడింది. కార్మికులకు ఉపాధి లేదు. – ఎస్.అహ్మద్ హుస్సేన్, ప్రొద్దుటూరు బులియన్ మర్చంట్స్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు.

250కి పైన జనాభా ఉన్న గ్రామాలకు
రోడ్డు కనెక్టివిటీ

- పీఎంజీఎస్‌వై-4 కింద మార్గదర్శకాలు జారీ
- ఫలించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషి

కడప సెవెన్‌రోడ్స్ : సరైన రహదారి సౌకర్యం లేక ఎన్నో ఏళ్లుగా అవస్థలు ఎదుర్కొంటున్న జిల్లాలోని కుగ్రామాలకు ఇక మహర్దశ పట్టనుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 250కి పైబడిన జనాభా ఉన్న గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ కల్పించనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై)-4కు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేశారు. దీంతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషి ఫలించినట్లయింది.

ఇప్పటివరకు జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లె, సీకే దిన్నె, రైల్వేకోడూరు బ్లాకులకే ఈ సౌకర్యం అందుబాటులో ఉండేది. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా గుర్తించిన ఆకాంక్షిత జిల్లాల్లో కడప ఒకటి. కనుక 250 పైబడి జనాభా కలిగిన గ్రామాలకు సైతం పీఎంజీఎస్‌వై-4 మార్గదర్శకాలు వర్తించే విధంగా చూడాలని కోరుతూ కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 11వ తేదీ కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి కమలేష్ పాశ్వాన్‌కు లేఖ రాశారు. అదే విషయాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రికి స్వయంగా వివరించారు. పరిశీలించిన కేంద్ర మంత్రి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి లేఖపై స్పందించారు. యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగామ్ కింద జిల్లా ఉన్నందున 250 పైబడి జనాభా కలిగిన గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ కల్పించే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. పీఎంజీఎస్‌వై-4 కింద ఈ అంశాన్ని చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి సైతం ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ ఎక్కడైనా ఇది సాధ్యపడకపోతే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏదో ఒక పథకం కింద చేపట్టాలని కేంద్ర మంత్రి తన ఉత్తర్వుల్లో కోరారు. పీఎంజీఎస్‌వై-4 మార్గదర్శకాలు విడుదల కావడంతో ఉమ్మడి జిల్లాలో మిగిలిన 46 బ్లాకులలోని 250+ జనాభా గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ ఏర్పాటు చేయనున్నారు. తద్వారా కోట్లాది రూపాయాలు నిధులు గ్రామీణ రహదారుల కనెక్టివిటీకి విడుదల కానున్నాయి.

జిల్లాలో 22 గ్రామాలకు ఉపయోగం...

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి లేఖ ఫలితంగా ఉమ్మడి జిల్లాలో 22 గ్రామాలకు కనెక్టివిటీ రహదారులకు అవకాశం ఏర్పడింది. వెరశి రూ.32.05 కోట్లుతో కనెక్టివిటీ రహదారులు నిర్మించనున్నారు. కడప పార్లమెంటు పరిధిలో 17 రహదారులకు రూ.21.35 కోట్లు, రాజంపేట పార్లమెంటు పరిధిలోని మూడు నియోజకవర్గాలకు 5 రహదారులకు రూ.10.7 కోట్లుతో కనెక్టివిటీ రహదారులు ఏర్పాటు చేయనున్నారు.



నేడు కొలువుతీరనున్న గంగమ్మ





గంగమ్మ తల్లి కొలువుతీరనున్న గంగమ్మ మిట్ట, ఆకట్టుకున్న డప్పు వాయిద్యా కళాకారుల విన్యాసం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కోడూరు గంగమ్మ జాతర నేడు గురువారం జరగనుంది. ఉదయం 5 గంటలకు పొట్టి శ్రీరాముల వీధిలోని అంకాలమ్మ గుడి దగ్గర నుంచి ఊరేగింపుగా తీసుకొస్తారు. గంగమ్మ మిట్టలో గంగమ్మ కొలువుతీరనుంది. ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. అలాగే ఉదయం వసంతోత్సవంతో గంగమ్మను ఉంగరాల నగర్ వద్ద నిమజ్జనం చేయనున్నారు. ఈ ఏడాది ఎటువంటి వీఐపీ పాస్‌లు లేకుండా అమ్మవారి దర్శనభాగ్యం కల్పించనున్నారు. జాతర నేపథ్యంలో బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు డప్పు వాయిద్యాలు, చెక్కభజన కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్



ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీతో రమేష్ బాబు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, తక్షణమే 12 నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక ఏఐటీయూసీ యూనియన్ జిల్లా కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు సునీల్ అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 14,000 మంది పనిచేసే ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 12 నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని వారు ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు సిద్ధమని అన్నారు.10సంవత్సరాలనుంచి గౌరవ వేతనం తో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమస్యల పరిష్కారం కోసం తక్షణమే కృషి చేయాలని, మహిళా కార్మికులకు పనిగంటల విధానం అమలు చేయాలని కోరారు.

కడప జిల్లా నూతన కమిటీ ఎన్నిక..

ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ కడప జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ బాబు తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా నాగసుబ్బారెడ్డి అధ్యక్షుడిగా మాధవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యామిని లత, ఉపాధ్యక్షుడిగా భాస్కర్ రెడ్డి, నరజహాన్, జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా సునీల్ కుమార్, డిప్యూటీ జెనరల్ సెక్రెటరీగా చంద్రమ్మ, సహాయ కార్యదర్శిలుగా ఈశ్వరమ్మ, కాశీ నారాయణ, ప్రసాద్ రెడ్డి ట్రెజరర్ శ్రీనివాసులు, సలహాదారులు మస్తాన్ రెడ్డి, వెంకటేష్‌లను ఎన్నుకున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీదర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ)సమీక్ష సమావేశం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి.. మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అయిన పారిశ్రామిక రంగాన్ని.. మరింత అభివద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇండస్ట్రియల్ పాలసీకి అనుగుణంగా జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడేలా జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనున్నట్లు తెలిపారు.కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రొత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లతో సమన్వయం చేయనున్నట్లు చెప్పారు. పరిశ్రమల ప్రమోషన్ కు సంబంధించి ఇంకా ఏవైనా అప్లికేషన్లు పెండింగ్‌లో ఉంటే.. వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయి నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై అవగాహన పెంపొందించాలన్నారు.పారిశ్రామిక అభివద్ధి పాలసీ (ఐడీపీ) 2023-27 ద్వారా ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి సంబంధించి 19 ట్రాన్స్పోర్ట్ వాహనాల ఇన్వెస్ట్మెంట్ సబ్సిడీ కింద రూ 1.93 కోట్ల రాయితీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలుపగా.. ట్రాన్స్‌పోర్టు వెహికల్‌కు సంబంధించి తనిఖీ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా, ఏపీఐఐసీ జెడ్ ఎం శ్రీనివాసమూర్తి, మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్, ఐపిఓలీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ జనార్దన్,డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్ శ్రీకాంత్ నాయక్,డిక్కీ కోఆర్డినేటర్ శివ శంకర్, ఏపీఐఐసీ ప్రతినిధులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అగ్నిమాపక డిడిఆర్ఎఫ్ అధికారులు,డిటిఓ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ, ఏపీఎస్ పిడీసీఎల్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

2న ప్రధాని రాష్ట్ర పర్యటనను విజయవంతం చేయాలి

మే నెల 2వ తేదీన భారత ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర రాజధానిలో పర్యటించనున్నారని.. ఆయన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి.. భారత ప్రధాని రాష్ట్ర పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటన కార్యక్రమాల్లో పాల్గొనే అధికారులంతా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గం నుంచి 10 వాహనాల ద్వారా ప్రధాని సభా కార్యక్రమంలో పాల్గొనేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలను సమాయత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డీఆర్డీఏ, డ్వామా పీడీలు ఆనంద్ నాయక్, ఆదిశేషారెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, నియోజక వర్గ ప్రత్యేక అధికారులైన వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు ఆశాజనకం

కడప సెవెన్‌రోడ్స్ : స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు ఆశాజనకంగా, చురుగ్గా సాగుతుండడం హర్షణీయం అని జిల్లా ఇన్‌చార్జి అధికారి (రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ - ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రెటరీ) సౌరబ్ గౌర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్ లతో కలిసి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌరబ్ గౌర్ మాట్లాడుతూ జిల్లాలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్ రానున్న 10 సంవత్సరాల్లో అతిపెద్ద ఇండస్ట్రియల్ క్లస్టర్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు తగ్గ అన్ని రకాల వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. స్టార్ట్ అప్ కడప ఇంప్లిమెంటేషన్ లో భాగంగా జిల్లా కేంద్రంలో అధునాతన వసతులతో స్టార్ట్ అప్ సెంటర్ (ఎంటర్ ప్రెన్యూర్షిప్ సెంటర్) భవన నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు, ఈ నిర్మాణం పూర్తయితే.. నూతన పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల నైపుణ్యాలను సమకూర్చి జిల్లా ఆర్థిక పురోగతికి అడుగులు వేయనున్నట్లు చెప్పారు.

అనంతరం కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. ప్రాథమిక రంగాలతో పాటు.. రానున్న ఐదేళ్లలో జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాల ప్రణాళికలను పిపిటి ద్వారా వివరించారు.సమావేశంలో డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, ప్రాథమిక రంగాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ మౌలిక సదుపాయాలకు విరాళం



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న యూసీఐఎల్ అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : యురేనియం కార్పొరేషన్ లిమిటెడ్ (యూసీఐఎల్) జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి మౌలిక సదుపాయాలు కల్పన, పరికరాల కొనుగోలు కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)నిధుల కింద రూ. 53.67 లక్షల విరాళ చెక్కును కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి అందజేశారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీసులో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ (టెక్నికల్) మనోజ్ కుమార్, జనరల్ మేనేజర్ (మిల్) సుమన్ సర్కార్, సంస్థ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలసి చెక్ ను ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేముల మండలం తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అందజేసిన నిధులతో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రిమ్స్‌లో ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్స్, టీబీజీ గైనిక్ ఇఎన్టి, రేడియాలజీ అనిస్థిసియా డిపార్టుమెంట్స్ లలో పరికరాల కొనుగోలుకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఆకాంక్షిత జిల్లా అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనలకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూసీఐఎల్ సీఎస్ఆర్ ఆఫీసర్ నవీన్ రెడ్డి, జియాలజిస్ట్ సురేంద్ర విజయ్ కుమార్, మేనేజర్ పీకే నాయక్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను

పోరుమామిళ్ల : పట్టణానికి కిలో మీటర్ దూరంలో ఈదుళ్లపల్లె వద్ద బుధవారం సాయంత్రం ఆటో బోల్తా పడిన ఘటనలో చింతలపల్లెకు చెందిన శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోరుమామిళ్ల వైపు వస్తున్న కారు వెనుకే ఆటో వస్తుండగా ఈదుళ్లపల్లె వద్ద కారు సడన్‌గా బ్రేక్ వేయడంతో కారుకు ఆటో గుద్దుకుంటుందన్న భయంతో ఆటో డ్రైవర్ కూడా బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీను కింద పడటంతో అతనిపై ఆటో పడింది. దీంతో ముఖం, ఛాతీ, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేశారు.

అదుపు తప్పి కారు బోల్తా


భూమయ్యగారిపల్లెలో అరటి తోటలోకి దూసుకెళ్లిన కారు

వేముల : మండలంలోని భూమయ్యగారిపల్లె క్రాస్ వద్ద బుధవారం కారు అదుపు తప్పి అరటి తోటలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె మండలం తాళ్లపల్లె గ్రామానికి చెందిన వెంకట్రామయ్య కుటుంబ సభ్యులతో కదిరిలో జరిగే వివాహ కార్యక్రమానికి వెళ్లారు. వివాహ అనంతరం స్వగ్రామానికి బయలుదేరారు. కారు భూమయ్యగారిపల్లె క్రాస్ వద్దకు రాగానే మోటారు సైకిల్‌ను తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న అరటి తోటలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారులో ఉన్న వారంతా క్షేమంగా బయటపడ్డారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి


మృతి చెందిన చిట్టిబోయిన మునిస్వామి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు మండలం మీనాపురం గ్రామంలో పిడుగు పాటుకు గురై చిట్టిబోయిన మునిస్వామి (45) అనే వ్యక్తి మృతి చెందాడు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మునిస్వామి సొంత ట్రాక్టర్‌తో పెన్నానదిలోని ఇసుకను బాడుగకు తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య లక్ష్మీతో పాటు పవన్‌కుమార్, తేజ అనే ఇరువురు కుమారులు ఉన్నారు. తన చెల్లెలికి పశువులు ఉన్నందున వాటికి మేత వేసేందుకు బుధవారం సాయంత్రం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అప్పటికే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఈ క్రమంలో పిడుగు పడటంతో షాక్‌కు గురై మునిస్వామి కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే అతన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వెంకటసురేష్ తెలిపారు.

వైభవోపేతంగా అక్షయ తదియ


పూలంగి సేవలో చెన్నకేశవ స్వామి


నదిలో స్నానాలు చేస్తున్న భక్తులు

వల్లూరు: పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం వైభవోపేతంగా జరిగిన అక్షయ తదియ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పెన్నా నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం ఉత్సవాలలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తలనీలాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇక్కడ పితృ దేవతలకు పిండ ప్రదానం చేస్తే కాశీలో చేసినంత పుణ్యం లభిస్తుందనే ప్రగాఢ విశ్వాసంతో అనేక మంది భక్తులు బ్రాహ్మణుల ఆధ్వర్యంలో తమ పితృ దేవతలకు పిండ ప్రదానం చేశారు.

వైభవంగా చెన్న కేశవుని పూలంగి సేవ

శ్రీ చెన్నకేశవ స్వామికి పూలంగి సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైద్యనాథునికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ చక్ర సహిత కామాక్షీ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.

తగ్గిన భక్తులు

రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చే ఈ బ్రహ్మోత్సవాలపై దేవాదాయ శాఖ అధికారులు ఈ ఏడాది సరైన ప్రచారం కల్పించకపోవడంతో భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది.

ఇష్ట వాహనాలపై హరి హరులు

రాత్రి శ్రీ చెన్నకేశవ స్వామి తనకు అత్యంత ప్రీతి పాత్రమైన గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వాములు తమకు ఇష్టమైన నంది వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు కల్యాణోత్సవాలు


బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఉదయం 10 గంటలకు శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వాములకు కల్యాణ మహోత్సవం జరుగుతుంది. రాత్రి 7 గంటల నుంచి శ్రీలక్ష్మీ చెన్న కేశవ స్వామికి శ్రీదేవి, భూదేవిలతో కల్యాణోత్సవం నిర్వహిస్తారు. రాత్రి వైద్యనాథ స్వామికి, చెన్న కేశవ స్వామికి గజవాహన సేవ ఉంటుంది.

విభూత్యాలంకారంలో ఇంద్రనాథేశ్వర స్వామి


శ్రీ ఇంద్రనాథేశ్వర స్వామి ఆలయంలో విభూత్యాలంకార సేవలో స్వామి వారు

వల్లూరు : పుష్పగిరి క్షేత్ర ఆలయాల సముదాయంలో భాగమైన చింతలపత్తూరులోని శ్రీ ఇంద్రనాథేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా అక్షయ తృతీయను పురస్కరించుకుని బుదవారం ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రాతఃకాలపూజ, మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు విభూత్యాలంకారంలోని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి


శ్రీనివాసులు (ఫైల్)

వేంపల్లె : స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో మంగళవారం రాత్రి జరిగిన దాడిలో కత్తి శ్రీనివాసులు (50)అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. వేంపల్లెలోని రాజీవ్ నగర్ కాలనీలో నివాసముంటున్న కత్తి శ్రీనివాసులుపై అదే కాలనీకి చెందిన వెంకటేష్, అంజి, రాయుడు, చిన్న అనే వ్యక్తులు దారుణంగా దాడి చేశారు. దీంతో చికిత్స కోసం కడప రిమ్స్‌కు వెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం కత్తి శ్రీనివాసులు మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లెలోని రాజీవ్ నగర్ కాలనీలో నివాసముంటున్న కత్తి శ్రీనివాసులు అనే వ్యక్తికి పందులు ఉండడంతో వాటికి ఆహారం అందించేందుకు అదే కాలనీలో ఉన్న కొత్త అంగడి వద్ద డ్రమ్ము పెట్టుకొని అ డమ్ములో ప్రజలు వేసిన అన్నం తీసుకొని వెళ్లేవాడు. దీంతో కత్తి శ్రీనివాసులకు అదే కాలనీలో ఉన్న వెంకటేష్, అంజిలకు వేస్ట్ అన్నం కోసం డ్రమ్ము పెట్టే విషయంలో గత రెండు నెలల నుంచి విభేదాలు ఉన్నట్లు తెలిపారు. మంగళవారం మృతుడు కత్తి శ్రీనివాసులు తన కుమారుడు అంకన్నను అన్నం డ్రమ్మును తీసుకొని రావాలని చెప్పడంతో అన్నం డ్రమ్ము తీసుకొని వచ్చేందుకు వెళ్లగా డమ్ము తీసుకొని వచ్చే సమయంలో వెంకటేష్, అంజి, రాయుడు, చిన్న అనే వ్యక్తులు దాడి చేయడంతో ఇంటికి వచ్చి అంకన్న తన తండ్రి కత్తి శ్రీనివాసులుకు దాడి చేసిన విషయం చెప్పడంతో మృతుడు శ్రీనివాసులు ప్రశ్నించేందుకు వెళ్లాడు. దీంతో అక్కడ జరిగిన వాగ్వాదంలో కత్తి శ్రీనివాసులుపై వెంకటేష్, అంజి, రాయుడు, చిన్న అనే వ్యక్తులు దాడి చేసినట్లు చెప్పారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులును కడప రిమ్స్ కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. మృతునికి భార్య మల్లేశ్వరి, ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు.

జాతీయ స్కేటింగ్ పోటీలకు కడప విద్యార్థిని


జెషికా ఏంజిల్‌ను అభినందిస్తున్న డీఎస్‌డీఓ, రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ చైర్మన్

కడప ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీలకు కడప నగానికి చెందిన కె. జెషికా ఏంజిల్ ఎంపికైంది. ఏప్రిల్ 16,17 తేదీలలో హైదరాబాదులో నిర్వహించిన కేంద్రీయ విద్యాలయ ఏపీ, తెలంగాణ రీజనల్ జోనల్ స్థాయి పోటీలలో ఈమె పాల్గొని మూడు గోల్డ్ మెడల్స్ సాధించింది. త్వరలో జగరనున్న జాతీయస్థాయి పోటీలలో ఆమె పాల్గొననుంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జెషికా ఏంజెల్‌ను డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి, రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి, కార్యదర్శి ఇబ్రాయిల్, కోచ్ విలియ్‌కేరీ, వ్యాయామ విద్య సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి అభినందించారు.

34 ఎర్రచందనం దుంగలు, ఇన్నోవా వాహనం సీజ్


ఎర్రచందనం, ఇన్నోవాలను సీజ్ చేసిన అటవీశాఖ అధికారులు

కడప అర్బన్/చింతకొమ్మదిన్నె : మామిళ్లపల్లి సెక్షన్, ఇప్పపెంట బీటు, పాలకొండ రిజర్వు ఫారెస్ట్‌లోని 'వంక బావి రస్తా' ప్రదేశంలో ఒక ఇన్నోవా వాహనం, 34 ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్ సమాచారం ప్రకారం కడప ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె. ప్రసాద్ ఆధ్వర్యంలో మామిళ్లపల్లి, మద్దిమడుగు సెక్షన్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్, బేస్ క్యాంపు సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు. పారిపోయిన నిందితులను త్వరలో పట్టుకుంటామని అధికారులు తెలిపారు. వాహన రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా (ఏపీ 37 సీహెచ్ 9919) యజమాని పులి వరప్రసాద్ రవికుమార్, రామేశ్వరం, ప్రొద్దుటూరుగా గుర్తించామన్నారు. ఈ దాడిలో మామిళ్లపల్లి సెక్షన్ డిప్యూటీ ఆర్ఓ ఎస్. ఓబులేసు, మద్దిమడుగు ఎఫ్ఎస్ఓ షకీల్ అహమ్మద్, ఎఫ్‌బీఓలు కె. శోభారాణి, ఎస్. బాషా, ఎస్. రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

నిమ్మనపల్లె : బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి నిమ్మనపల్లి మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లి పట్టణం బాబు కాలనీకి చెందిన ఎం.అశోక్ కుమార్ (22), వైఎస్సార్ కాలనీకి చెందిన ఎం.ప్రదీప్ (18) ఇద్దరు యువకులు కలసి ద్విచక్ర వాహనం లో నిమ్మనపల్లి మండలం తవళం పంచాయతీలోని నేల మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద జరుగుతున్న బంధువుల పెళ్లికి వెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటలకు మదనపల్లెకు వెళుతుండగా, మార్గమధ్యంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారి పల్లె వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో బాధితులను మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రదీప్‌ను తిరుపతి రుయా ఆసుపత్రికి, అశోక్ కుమార్‌ను తిరుపతి లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

మైదుకూరు : పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పోతిరెడ్డిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మైదుకూరుకు చెందిన వైద్య విద్యార్థి వీరమల్లు నవనీత్ కుమార్ గాయపడ్డాడు. నవనీత్ కుమార్ తండ్రి వీరమల్లు మల్లేష్ వైఎస్సార్ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓగా పనిచేస్తున్నారు. పోతిరెడ్డిపాలెం వద్ద కారు ఇంటిని ఢీకొట్టిన సంఘటనలో ఐదుగురు వైద్య విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందగా, నవనీత్ కుమార్ తీవ్రంగా గాయపడి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. సంఘటన గురించి తెలియగానే నవీనత్ కుమార్ తండ్రి డాక్టర్ మల్లేష్ కుటుంబ సభ్యులతో కలిసి హుటాహుటిన నెల్లూరుకు బయల్దేరారు.

మే 2వ తేదీ బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్స్ ఎంపికలు

కడప ఎడ్యుకేషన్ : కడప జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 2వ తేదీన జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ సబ్ జూనియర్ బాల బాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు బాస్కెల్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సహదేవరెడ్డి తెలిపారు. ఈ పోటీలను కడప నగరం జయనగర్ కాలనీలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో 2వ తేదీ సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డుతో 2012 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారు మాత్రమే హాజరు కావాలని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పెద్దముడియం : మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న ఇద్దరిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీ బాటవారిపల్లెలో చింతచెట్టుకింద మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 92 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు బాటివారి పల్లెకు చెందిన నాగేశ్వరమ్మ, ఆనందరెడ్డిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి


మృతి చెందిన సఫయాత్‌ఖాన్


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిన్నమండెం : మండల పరిధిలోని కడప–బెంగళూరు జాతీయ రహదారి మల్లూరు క్రాస్ వద్ద మామిడి కాయల మండీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడు పి.సఫయాత్‌ఖాన్(32) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పి.సఫయాత్‌ఖాన్, ఇబ్రహీం ఖాన్‌లు తమ సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో సఫయాత్‌ఖాన్ అక్కడికక్కడే మృతి చెందగా ఇబ్రహీం ఖాన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 సాయంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటులోనూ సడలని గుండె నిబ్బరం

ఆటో నడుపుతూ డ్రైవర్ మృతి


ఆటోలోనే మృతిచెందిన పెంచలయ్య

బద్వేలు అర్బన్ : బద్వేలు – మైదుకూరు రహదారిలోని చెన్నంపల్లె సమీపంలో బుధవారం ఓ ఆటో డ్రైవర్ ఆటో నడుపుతూ గుండెపోటు రావడంతో ఆటోలోనే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం రెడ్లదిన్నె ఎస్సీ కాలనీకి చెందిన గొల్లపల్లె పెంచలయ్య (33) కూలి పనులకు వెళ్లడంతో పాటు ఆటో తోలుకుని జీవనం సాగిస్తుంటాడు. ఇతనికి 15 సంవత్సరాల క్రితం జిల్లాలోని ఖాజీపేట మండలం ముత్తులూరుపాడు గ్రామానికి చెందిన మరియమ్మతో వివాహం కాగా వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. నెల రోజుల క్రితం భార్యాభర్తల నడుమ మనస్పర్ధలు రావడంతో మరియమ్మ పుట్టింటికి వచ్చేసింది. ఈ క్రమంలో పెంచలయ్య బుధవారం ఉదయం స్వగ్రామం నుండి బయలుదేరి ముత్తులూరుపాడుకు వచ్చాడు. అక్కడ భార్యతో మాట్లాడి పెద్ద కుమారుడిని తన వెంట తీసుకుని ఆటోలో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో కొందరు ప్యాసింజర్లను సైతం ఆటోలో ఎక్కించుకున్నాడు. అయితే చెన్నంపల్లె సమీపంలోకి వచ్చేసరికి పెంచలయ్యకు గుండెపోటు వచ్చి ఆటోలోనే ఒరిగిపోయాడు. ఇంతలో ఆటోలోని ప్యాసింజర్లు కిందికి దించి సపర్యలు చేసినప్పటికీ స్పృహలోకి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి పెంచలయ్యను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెపోటు వచ్చినప్పటికీ ఆటోను రోడ్డు పక్కన నిలపడంతో అందులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

ఐటీఐలో శిక్షణ..ఉపాధికి నిచ్చెన

- కోర్సు పూర్తికాగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ప్రవేశాలకు మొదలైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ


ప్రాక్టికల్స్‌లో తర్ఫీదు పొందుతున్న మోటార్ మెకానిక్ విద్యార్థులు

రాజంపేట టౌన్ : కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా త్వరగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలనుకునే విద్యార్థులకు ఐటీఐ ఓ వరమని చెప్పవచ్చు. ఐటీఐలో ఏ ట్రేడ్ కోర్సు పూర్తి చేసినా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. అలాగే ప్రధానంగా రైల్వే, ఆర్టీసీ, విద్యుత్‌శాఖ వంటి ప్రభు త్వరంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాల కల్పనలో ఐటీఐ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. స్వయంగా కూడా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది.

జిల్లాలో 15 ఐటీఐలు..

అన్నమయ్య జిల్లాలో మొత్తం 15 ఐటీఐలు ఉన్నాయి. ఇందులో మూడు ప్రభుత్వ ఐటీఐలు కాగా 12 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి. రాజంపేట, పీలేరు, తంబళ్లపల్లెలో ఒక్కొక్క ప్రభుత్వ ఐటీఐ ఉంది. ప్రైవేట్ ఐటీఐల విషయానికి వస్తే మదనపల్లెలో నాలుగు, రాయచోటిలో రెండు, రాజంపేట, రైల్వేకోడూరు, తంబళ్లపల్లె, పీలేరు, గుర్రంకొండ, వాయల్పాడులో ఒక్కో ప్రైవేట్ ఐటీఐ ఉంది.

మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు..

ఐటీఐలో ప్రధానమైన ట్రేడ్‌లలో ప్రవేశానికి టెన్త్ ఉత్తీర్ణులై ఉండాలి. అయితే టెన్త్‌లో సాధించిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా ఐటీఐలో సీట్ల కేటాయింపు ఉంటుంది. టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారికి కోరుకున్న ఐటీఐ కేంద్రంలో, ట్రేడ్ ఎంపికలో ప్రాధాన్యత ఉంటుంది. టెన్త్‌లో కొంత మంది విద్యార్థులకు సమానమైన మార్కులు వచ్చినప్పుడు గణితంలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. గణితంలో కూడా సమానమైన మార్కులు వచ్చివుంటే సైన్స్‌లో అత్యధిక మార్కులు వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఒకవేళ గణితం, సైన్స్ రెండు పాఠ్యాంశాలలో సమానమైన మార్కులు వచ్చినప్పుడు పుట్టిన తేదీని పరిగణలోకి తీసుకొని ఎక్కువ వయస్సు ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారు. రిజర్వేషన్ల కేటగిరిని కూడా పరిగణలోకి తీసుకొని సీట్లను భర్తీ చేస్తారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఐటీఐలో ఉత్తీర్ణులై అప్రెంటీస్ కూడా పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలను సులువుగా అందిపుచ్చుకోవచ్చు. అలాగే విద్యు త్, రక్షణ, రైల్వే రంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయి. అయితే విద్యార్థులు వారికి సంబంధించిన ట్రేడ్‌లలో మంచి నైపుణ్యం కలిగి ఉంటే స్వ యంగా కూడా ఉపాధి అవకాశాలను పొందవచ్చు.

నేరుగా పాలిటెక్నిక్‌లోకి ప్రవేశం

ఐటీఐలో రెండేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో ప్రవేశానికి అర్హులవుతారు. పాలిటెక్నిక్ చదవాలనుకునే విద్యార్థులు తొలుత నెలరోజుల వ్యవధిగల బ్రిడ్జి కోర్సు చేసి ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ట్రేడ్‌ల వారీగా బ్రాంచ్‌లు కేటాయింపు

ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన ట్రేడ్‌లను బట్టి పాలిటెక్నిక్‌లో బ్రాంచ్‌ల కేటాయింపు ఉంటుంది. ఐటీఐలో ఎలక్ట్రీషియన్ కోర్సు పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లో సీటు కేటాయిస్తారు. అలాగే ఫిట్టర్, టర్నర్ మెషినిస్టు, రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండీషన్ కోర్సు చేసిన వారికి మెకానికల్ బ్రాంచ్‌లో, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, రేడియో అండ్ టీవీ మెకానిక్ కోర్సు చేసిన వారికి ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లో, మెకానిక్ మోటార్ వెహికల్ ఉత్తీర్ణులైన వారికి ఆటోమొబైల్ బ్రాంచ్‌లో సీటు కేటాయిస్తారు.

ఉజ్వల భవిష్యత్తు



వివిధ కారణాల రీత్యా ఉన్నత చదువులు చదివేందుకు వీలు కాని వారికి ఐటీఐ చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఐటీఐ కోర్సు పూర్తి చేసుకున్న వారికి తప్పక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి. ప్రతిభ గల విద్యార్థులకు ఐటీఐ పూర్తి చేసిన తరువాత ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశం కల్పించేందుకు కృషి చేస్తాము. ఆర్థిక పరిస్థితుల కారణంగా త్వరగా జీవితంలో స్థిరపడాలనుకునే విద్యార్థులకు ఐటీఐ ఓ వరం లాంటిది.

ఆర్.రఘురామిరెడ్డి, జిల్లా కన్వీనర్, పారిశ్రామిక శిక్షణా సంస్థ

కొడుకు దూరమై.. బతుకు భారమై


టైలర్ బాలకృష్ణ మృతదేహం

కురబలకోట/బి.కొత్తకోట : ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లోని గంగోత్రి చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన బి. కొత్తకోటకు చెందిన బాలకృష్ణ (29) మృతదేహాన్ని బుధవారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది బోటు సాయంతో వెలికి తీశారు. బాలకృష్ణ బి.కొత్తకోట కాలనీలో టైలర్‌గా ఉన్నారు. ఇతని సంపాదనతోనే రోజులు గడిచేవి. ఇతను ఒక్కడే కుటుంబానికి ప్రధాన జీవనాధారం. ఇతను అవివాహితుడు. పెళ్లి సంబంధాలు చూస్తున్న తరుణంలో ఈతకు వెళ్లి ఆకస్మికంగా మృతి చెందడం కలచివేస్తోంది. ఇతనికి ఈత వచ్చినప్పటికీ చెరువు చివరి వరకు వెళతానని వెళ్లాడు. మధ్యలోకి వెళ్లాక ఈదలేక మునిగిపోయి చనిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. ఇతని తండ్రి శ్రీనివాసులు ఆరేళ్ల క్రితం హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. అక్క పద్మజకు వివాహమైంది. తల్లి మంజుల (50) నిస్సహాయురాలు. అన్న శివ కృష్ణ (35) మానసిక వికలాంగుడు. తల్లిని, అన్నను ఇతనే చూసుకునే వాడు. ఇప్పుడు అతను తిరిగిరాని లోకానికి వెళ్లిపోవడంతో వారి బతుకు ప్రశ్నార్థకంగా మారింది. తల్లి మంజుల పరిస్థితిని తలచుకుని బంధుమిత్రులు వేదన పడుతున్నారు. ఆధారంగా ఉన్న కొడుకు దూరం కావడంతో ఆ తల్లి తల్లడిల్లుతోంది.